క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: చార్మినార్ సీబీడీ ఏడీ ఈ పరిధిలోని షాలిమార్ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఓ ప్రకటనలో తెలిపారు. హైదర్‌గూడా, హుస్సేనీ ఆలం ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. షాగంజ్, చౌక్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు. పురానపూల్ విద్యుత్ పీటర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. లాడ్ బజార్, కిల్వత్, ఈద్గా తదితర విద్యుత్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చార్మినార్ ఏడీఈ తెలిపారు.

ఫలక్‌నుమా ఏడీఈ పరిధిలో..
ఫలక్‌నుమా యాజీసీ, ఫలక్‌నుమా ఓహెచ్ తదితర విద్యుత్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఫాతిమా నగర్, వట్టెపల్లి, గుంటల్ షా దర్గా తదితర విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్ నుమా ఏడీఈ తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

అఫ్జల్‌గంజ్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలను నేరుగా అధికారులతో పంచుకోవడానికి టీఎస్ ఆర్టీసీ డయల్ యువర్ ఆఫీసర్ కార్యక్రమాన్ని చేపట్టిందని హైదరాబాద్ డిపో–1 మేనేజర్ కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు హైదరాబాద్ డిపో–1 పరిధిలోని రాయచూర్, యాద్గిర్, గుల్బర్గా, సేడం, ఆదిలాబాద్, సోలాపూర్, బెంగళూరు, కర్నూల్, నంద్యాల, ఆదోని తదితర రూట్లల్లో ప్రయాణించే ప్రయాణికులు తమ సమస్యలను 99592 26248కు ఫోన్ చేసి తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించిన పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

నేడు డయల్ యువర్ డిప్యూటీ రీజినల్ మేనేజర్

సంతోష్‌నగర్: ఈనెల 31న సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఓ) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు హయత్‌నగర్ డివిజన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఓ) తెలిపారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని బండ్లగూడ, దిల్‌సుఖ్‌నగర్, హయత్ నగర్, ఇబ్రహీంపట్నం, మిధాని, మహేశ్వరం తదితర ప్రాంతాల ప్రయాణికులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సలహాలు, సూచనలు చేయాలన్నారు. ప్రయాణికులు 99592 26136లో సంప్రదించి తమ ఫిర్యాదులు, సలహాలు, సూచనలు చేయాలన్నారు.

మోచీ సమాజ్ అభ్యున్నతికి కృషి


కాంతిలాల్‌ను సన్మానిస్తున్న సమాజ్ సభ్యులు

జియాగూడ: మోచీ సమాజ్ అభ్యున్నతికి కృషి చేస్తానని సంత్ రవిదాస్ మోచీ సమాజ్ సేవా సంఘం నూతన అధ్యక్షుడు మహేష్కర్ కాంతిలాల్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జియాగూడలోని సంజయ్‌నగర్‌లో గల సంత్ రవిదాస్ మోచీ సమాజ్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా మహేష్కర్ కాంతిలాల్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మోచీ కులస్తుల సమస్యలను పరిష్కరించాలని చెప్పులు కుట్టే వృత్తితో జీవిస్తున్న మోచీలకు ఉపాధి కరువైందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మోచీ కులస్థులకు దళితబంధును అందించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మనోహర్‌లాల్ పుర్వే, ఉమేష్ మహేష్కర్, మనోహర్ మాహోరే, వినోద్ దయాల్, ముఖేష్ మహోరే, నర్సింగ్ పర్వారే, గణేష్ దేవీకర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అక్షయ భరతనాట్య అరంగేట్రం



నాంపల్లి: నర్తకి అక్షయ నటరాజన్ భరతనాట్య అరంగేట్రం ఆదివారం నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళామందిరంలో నాట్య గురువు మాధవి మార్లెళ్లపూడి ఆధ్వర్యంలో భరతనాట్య అంశాలను అద్భుతంగా ప్రదర్శించి మెప్పించారు. చక్కటి హావభావాలతో తొలి ప్రదర్శనలోనే ప్రేక్షకులను ఆద్యంతం కట్టిపడేశారు. అక్షయ నటరాజన్ వాషింగ్టన్‌లో పుట్టి పెరిగినా మన భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, కళలపై ఉన్న ఆసక్తితో భరతనాట్యాన్ని నేర్చుకున్నారు. ఆరేళ్ల నుంచే అక్షయ నటరాజన్ భరతనాట్యంలో అడుగులు వేయడం ప్రారంభించింది. భరతనాట్యంలో మధ్యమ పూర్ణ పరీక్ష కూడా పూర్తి చేసింది. నాట్యాంజలి ఫెస్టివల్, తెలంగాణ నాటక అకాడమీ డ్యాన్స్ ఫెస్టివల్‌లో కూడా నర్తించింది. వాషింగ్టన్‌లో ఈస్ట్‌లేక్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. నృత్యంతో పాటు స్విమ్మింగ్, పెయింటింగ్‌లో కూడా పట్టు సాధించింది.

మూసీ నిండి.. ఉపాధికి గండి

- రోజుల తరబడి పారుతున్న వరద
- చాకిరేవుల మునకతో రజకుల తిప్పలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు


పురానాపూల్ మూసీనదిలో మునిగిన చాకిరేవుల దృశ్యం

జియాగూడ: వర్షాలు కురిసిన ప్రతిసారి మూసీనది పొంగిపొర్లుతుంది. నదిలో బట్టలు ఉతికి ఉపాధి పొందే రజకులకు చాకిరేవుల మునకతో వృత్తి నిలిచిపోతుంది. రోజుల తరబడి మూసీనదిలో వరదనీరు పారుతుండగా రజకుల ఉపాధికి గండి పడింది. ఏడాదికి పలుమార్లు జంట జలాశయాల నీరు విడుదల చేస్తుంటారు. ఈ వర్షాకాలంలో వరదనీరు భారీగా వదలడంతో రజకుల చాకిరేవులు మునిగాయి. జియాగూడ పరిసరాల్లోని మూసీనది స్థలాలు కబ్జా అవుతుండగా నది వైశ్యాల్యం కుంచించుకుపోతుంది. దీని ప్రభావం వల్ల ఒడ్డున ఉన్న చాకిరేవులు మునకకు దారి తీస్తున్నాయి.

మునుగుతున్న చాకిరేవులు..
మూసీనదిలో పారుతున్న నీటిలో బట్టలు ఉతికి ఉపాధి పొందే రజక కుటుంబాలు వేల సంఖ్యల్లో ఉన్నాయి. పురానాపూల్, గణేష్ ఘాట్, గిరకపల్లి, కార్వాన్, జుమ్మెరాత్‌బజార్, తదితర ప్రాంతాల్లో రజక చాకిరేవులు ఉన్నాయి. వరదలు వచ్చిన ప్రతిసారి ఈ చాకిరేవులకు ముంపు తప్పడం లేదు. మూడు నాలుగు ఏళ్ల నుంచి పెద్ద ఎత్తున వర్షాలు పడుతుండడంతో వర్షాకాలంలో రజకుల చాకిరేవుల మునకతో ఉపాధి ఇబ్బందిగా మారింది. వందల ఏళ్ల నుంచి రజకులు మూసీనదిలో చాకిరేవుల ద్వారా ఉపాధి పొందుతుండగా అవికూడా వరదల ధాటికి శిథిలావస్థకు చేరాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చాకిరేవులు ఉన్నచోట బట్టలు భద్రపరచుకునే గదులను కూడా నిర్మించుకున్నారు. అవి కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. తెల్లవారుజాము నుంచే ఈ వృత్తి నిర్వహించుకునేవారికి విద్యుత్‌దీపాలు లేకపోగా అపరిశుభ్రత, మురుగు, విష క్రిమి కీటకాల సంచారం, దోమల బెడద తదిర ఎన్నో సమస్యలు రజకులను పీడిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రజకుల కోసం చాకిరేవులను అభివృద్ధి చేయాలని రజకులా సమాజ్ కోరుతుంది.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. అయనను కార్వాన్, గుడిమల్కాపూర్ నుంచి పలువురు వచ్చి ఆదివారం కలిశారు. వారి ప్రాంతాల్లో ఉన్న సమస్యలను ఆయనకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారీ వర్షాలకు కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. బల్దియా వారు మాన్‌సూన్ టీంలు రోడ్ల ప్యాచ్‌వర్కులు చేస్తున్నాయన్నారు. డ్రైనేజీల మరమ్మతులకు జలమండలి వారు చురుకుగా పని చేస్తున్నారని ఆయన తెలిపారు. అంటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. పారిశుద్ధ్య పనులు వెంటనే చేయడానికి అదనపు పారిశుద్ధ్య యూనిట్లు ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు బేగ్, జబ్బార్ తదితరులున్నారు.

వికలాంగులకు మజ్లిస్ అండ


అసదుద్దీన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వికలాంగుల సంఘం సభ్యులు

గోల్కొండ: మజ్లిస్ పార్టీ వికలాంగులకు అండా ఉంటుందని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు ఇస్తున్న రూ.లక్ష రుణం తమకు కూడా వర్తింపజేయాలని, వికలాంగుల వ్యాపారాన్ని బట్టి రూ.లక్ష పరిమితిని పెంచాలని వారు ఆయనను కోరారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. వికలాంగులకు ఇచ్చే రుణ పరిమితిని పెంచడం కోసం తాను అధికారులతో మాట్లాడుతానన్నారు. అంతేకాకుండా వారికి రుణ వాయిదాలు పెంచడంతో పాటు సబ్సిడీ ఇవ్వాలని కూడా కోరతానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జాహెద్ అలీ, సయ్యద్ అఫ్రోజ్, మహ్మద్ యూసుఫ్, గులాం మహమూద్, ఎంఏ జాహెద్, అక్రమ్ అలీ తదితరులున్నారు.

భారతీయ కళా సంస్కృతిని కాపాడుకుందాం


జొన్నలగడ్డ ఈశ్వరప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న పలువురు ప్రముఖులు

గన్‌ఫౌండ్రీ: 300 మంది విద్యార్థుల భరతనాట్య వీణావాయిద్య కచేరి ఆహుతులను ఆకట్టుకుంది. ఆదివారం కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో సరస్వతి సంగీత నృత్య శిక్షణాలయం 21వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుకూరు బాలాజీ దేవస్థానం ప్రధాన అర్చకులు రంగరాజన్ మాట్లాడుతూ.. భారతీయ కళా సంస్కృతిని యువతరానికి నేర్పించే మహోన్నత కార్యక్రమాన్ని తీసుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం కళాకారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అలరించాయి. అంతకు ముందు ప్రముఖ నాట్య కళాకారులు జొన్నలగడ్డ ఈశ్వర్‌ప్రసాద్, జొన్నల గడ్డ సిధ్రప లక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సినీనటుడు పీవీఎల్ నర్సింహారావు, సంగీత క్షీరసాగరం వ్యవస్థాపకులు ఆనందమోహన్, నిర్వాహకులు ప్రతిమా శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 75వ బోనాల వజ్రోత్సవాలు


వేడుకల్లో పాల్గొన్న వారిని సన్మానిస్తున్న నిర్వాహకులు

యాకుత్‌పురా: హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళి ఆలయ 75వ బోనాల వజ్రోత్సవాల ముగింపు వేడుకలు శనివారం రాత్రి తెలంగాణ సారస్వత పరిషత్తు తిలక్ రోడ్డులో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్ హాజరై వివిధ శాఖల అధికారులు, ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీలో పలు ఆలయ ప్రతినిధులు, ప్రముఖ పాత్రికేయులకు బోనాల సందర్భంగా సేవలందించిన వారికి శాలువా కప్పి మెమొంటో సన్మానించారు. ఈ సందర్భంగా రుక్మిణీ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగిన అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం ఈ సంవత్సరం 75వ బోనాల వజ్రోత్సవాలను వైభవంగా నిర్వహించడం పట్ల ఆలయ కమిటీ వారికి అభినందనలు తెలియజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు రాందేవ్ అగర్వాల్, భవనం ట్రస్టు చైర్మన్ వి.అయోధ్య రాములు, ఆలయ కమిటీ ప్రతినిధులు జీ.రాజారత్నం, డాక్టర్ ఎ.భరత్ ప్రకాశ్, ఎ.సతీష్ కుమార్, డి.ప్రభాకర్, ఎస్.పి.క్రాంతి కుమార్, చేతన్ సూరి, ఎం.వినోద్, జగన్‌మోహన్ కపూర్, రామ్‌సింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజాధనం ‘చెత్త’పాలు


చెత్త కుప్పల్లో బల్దియా డస్ట్ బిన్


టోలిచౌకిలో రోడ్డు పక్కనపడి ఉన్న డస్ట్ బిన్

గోల్కొండ: రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన డస్ట్ బిన్‌లు చెత్తపాలవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పలు ప్రాంతాల్లో వీటిలో కొన్ని చెత్త కుప్పలో చేరిపోగా, మరికొన్నింటిని ఫుట్‌పాత్ వ్యాపారులు తొలగించి రోడ్ల పక్కన పాడేశారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లపై చెత్తను వేయకుండా ప్రత్యేకంగా కోట్ల రూపాయలు వెచ్చించి డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేశారు. మెహిదీపట్నం, నానల్‌నగర్ చౌరస్తా, మాసబ్‌ట్యాంక్, టోలిచౌకి చౌరస్తా తదితర ప్రాంతాల్లో ఎన్నో చెత్త డబ్బాలు వృథాగా.. కొన్ని గయాబ్ కాగా మరికొన్ని రోడ్ల పక్కన పడివున్నాయి. టోలిచౌకిలో భవన నిర్మాణానికి అవసరమయ్యే ఇసుక, ఇటుక, హైడర్లు, కంకర అమ్మేవారు ఫుట్‌పాత్‌లపై ఉన్న డస్ట్‌బిన్‌లను తొలగించారు. డస్ట్ బిన్‌లు ఒక్కొక్కటిగా కనుమరుగవుతున్నా అధికారులకు చలనం లేకుండా పోతుంది.

హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా రాంబాబు

నాంపల్లి: హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా టి.రాంబాబు బాధ్యతలు స్వీకరించారు. మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్‌లో డీఐగా విధులు నిర్వర్తించిన రాంబాబు ఆదివారం జరిగిన సాధారణ బదిలీల్లో హబీబ్‌నగర్‌కు వచ్చారు. హబీబ్‌నగర్ సీఐగా పనిచేసిన సైదబాబు శ్రీరామ్ టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు.

నాంపల్లి ఇన్‌స్పెక్టర్‌గా అభిషేక్..
నాంపల్లి శాంతిభద్రతల ఇన్‌స్పెక్టర్‌గా అభిషేక్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. మధ్య మండలంలోని అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో డీఐగా పనిచేస్తూ నాంపల్లికి బదిలీపై వచ్చారు. నాంపల్లి ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన రాజు నాయక్ బానోతు మధ్య మండలం టాస్క్‌ఫోర్స్‌కు బదిలీపై వెళ్లారు.

వైద్య వృత్తి ఎంతో పవిత్రమైంది


అవార్డు గ్రహీతలతో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్

గన్‌ఫౌండ్రీ: వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురికి వైద్య రత్న అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, సీనియర్ న్యాయవాది లయన్ డాక్టర్ ఏవీ.స్వామి, వైద్య నిపుణులు డాక్టర్ ఆశీష్ చౌహాన్, విశ్రాంత డీసీపీ బద్రినాథ్, సంస్థ వ్యవస్థాపకులు మల్లికార్జున్‌రావు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

అనిరుధ్ ఆచార్య మహారాజ్‌కు స్వాగతం


స్వాగతం పలుకుతున్న కిసాన్‌మోర్చ ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణాగుప్తా తదితరులు

అబిడ్స్: ఆధ్యాత్మిక గురువు అనిరుధ్ ఆచార్య మహారాజ్‌కు ఘన స్వాగతం పలికారు. జ్ఞాన్‌బాగ్ కాలనీలో గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణాగుప్తాతో పాటు పలువురు నాయకులు ఆయనకు స్వాగతం పలికి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ముక్క కృష్ణాగుప్తా మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు.

అక్రమ కమేళాపై పోలీసుల దాడులు

చాంద్రాయణగుట్ట: గోవులను వధిస్తున్న అక్రమ కమేళాపై ఫలక్‌నుమా పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ముస్తఫానగర్‌లో ఖదీర్(54), కరీం(30) కొన్ని రోజులుగా జంతు కమేళాను నిర్వహిస్తున్నారు. ఇతర జంతువుల ముసుగులో గుట్టుగా గోవులను వధిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న ఫలక్‌నుమా పోలీసులు దాడులు నిర్వహించి ఆరు గోవులను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులను అరెస్ట్ చేశారు.

సాహిత్యం సమాజ అభ్యున్నతికి దోహదం


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అంపశయ నవీన్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: సాహిత్యం సమాజాన్ని అనేక కోణాలలో ప్రతిబింబింపజేస్తుందని కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత, ప్రముఖ రచయిత అంపశయ నవీన్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు సాహితీవనం 6వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రచయితలు రచించిన పలు పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాహిత్యం సమాజ అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా రచయితలు డాక్టర్ పి.విజయలక్ష్మి పండీట్, ప్రసాదరావుకు జీవన సాఫల్య పురస్కారం, కల్లూరి రాజుకి యువకవి పురస్కారం, రావుల దయాకర్, వెంకటేష్, చాగంటి సత్యకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, రచయిత్రి ఓల్గా, పెద్దింటి అశోక్‌కుమార్, సత్యాజి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరణలో కమిటీ సభ్యులు

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ దాయిబాగ్‌లోని హనుమాన్ బాలాజీ మందిరం 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు సత్యంచారి, బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు గౌరిగె శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో ఆదివారం బ్రహ్మోత్సవ ఆహ్వాన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రస్టు ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, సహాయ కార్యదర్శి దాస శ్రీనివాస్, కోశాధికారి సామల శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘తెలంగాణలో బీజేపీదే అధికారం’

గోల్కొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన గుడిమల్కాపూర్‌లో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో ఎన్నో స్కాంలు, పేపర్ లీకేజీలు జరిగాయని, వీటి వల్ల ప్రజలు బీఆర్ఎస్ పట్ల అసహనం ఏర్పడిందన్నారు. అవినీతి రహిత పాలన కేవలం బీజేపీ సాధ్యమని ప్రజలు తెలుసుకున్నారని ఆయన అన్నారు. అనంతరం బీసీ సమాజ్ బహిరంగ సభకు బయలుదేరి వెళ్లారు.


బీజేపీ నాయకులతో దేవర శ్రీనివాస్ తదితరులు

ఆకట్టుకున్న ‘చండాలిక’ నృత్య రూపకం



గన్‌ఫౌండ్రీ: సంగీతం, నృత్యం ఆహ్లాదాన్ని పంచడంతో పాటు ఒత్తిడిని దూరం చేస్తాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో మహతి మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో రవీంద్రనాథ్ ఠాకూర్ కథానికం, చండాలిక నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో గొప్పదైన మన వారసత్వం, విలువలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఎంతగానో ఉందన్నారు. వైద్య వృత్తిలో ఉంటూ నిత్యం ఎంతో బిజీగా ఉండే వైద్యురాలు నృత్యాన్ని నేర్చుకోవడం ఎంతో ప్రశంసనీయమన్నారు. అంతకు ముందు డాక్టర్ సుశీల శ్రీకాంత్ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమి అధ్యక్షులు దీపికారెడ్డి, ఫెర్నాండేజ్ ఫౌండేషన్ చైర్మన్ ఫెర్నాండేజ్ బొమ్మిడాల గ్రూప్ ఎగ్జిబిషన్ డైరెక్టర్ బొమ్మిడాల రాజ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శం


మంత్రిని కలిసిన ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు

అబిడ్స్: బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. జాంబాగ్‌లోని పలువురు మైనార్టీలతో కలిసి బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్ మంత్రితో సమావేశమయ్యారు. మైనార్టీల సమస్యలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. మైనార్టీల కోసం సీఎం కేసీఆర్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. గోషామహల్ నియోజకవర్గం ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తానని వివరించారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ అహ్మద్, మహ్మద్ సలీం, మహ్మద్ గౌస్, సీహెచ్ జహంగీర్, యూసుఫ్‌పటేల్, షబానాబేగం, అక్తర్‌బేగం, మీరాజ్ అహ్మదుల్లా బేగ్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బియ్యం పంపిణీ

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో నిరుపేదలకు ఆదిత్య శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉండి నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ట్రస్టు చైర్మన్, నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. పురానాపూల్ నుంచి మూసీ ఒడ్డునున్న వరద బాధితులకు ఆయన ట్రస్టు తరఫున బియ్యం, దుస్తులు పంపిణీ చేశారు. నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. బాధితులను ప్రభుత్వానికి తోడుగా తమ ట్రస్టు కూడా ఆదుకుంటుందన్నారు. 20 ఏళ్లుగా గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనిత, సంతోషి, పప్పుమాత్రే, శైలేష్ కురుమ, ప్రదీప్‌రాజ్ పాల్గొన్నారు.


వరద బాధితులకు బియ్యం, దుస్తులు పంపిణీ చేస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్ తదితరులు

‘బస్తీబాట’లో ప్రజా సమస్యల పరిష్కారం


సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్

అబిడ్స్: బస్తీబాట ద్వారా ప్రజా సమస్యలు వేగంగా పరిష్కారం అవుతాయని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. బేగంబజార్ డివిజన్‌లోని మొగరం బస్తీ, మహారాజ్‌గంజ్ బస్తీల్లో బస్తీబాట కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆశీష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, విద్యుత్, ఇతర శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్, వెంకటేష్, గణేష్, శ్రీనివాస్, వేణు, నరేష్, శివుడు, ప్రశాంత్, అరవింద్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మేకల మండి.. సమస్యలు పరిష్కరించండి

- అధ్వానంగా మారుతున్న జియాగూడ మేకల మండి
- వర్షాలతో బురదమయం
- పట్టించుకోని అధికారులు


మండిలో పేరుకుపోయిన బురద

జియాగూడ: వరుసగా కురుస్తున్న వర్షాలకు జియాగూడ మేకలమండి బురదమయంగా మారింది. గొర్రెలు, మేకల విక్రయాలు కూడా పడిపోయాయి. శ్రావణమాసం మొదలవ్వడం, వర్షాలు తీవ్రంగా పడడం, మండి పూర్తిగా బురదమయంగా మారడం, విక్రయాలు లేక వధశాల కార్మికులు సైతం ఉపాధి లేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

వాగ్దానాలకే పరిమితం..
ఎన్నికల సందర్భంలో మాత్రమే ప్రధాన ఎజెండగా పలు పార్టీల నాయకులు మేకల మండి ఆధునీకరణ చేపడుతామని వాగ్దానాలు గుప్పిస్తారు. అనంతరం ఉన్న కనీస సమస్యలను సైతం పట్టించుకున్న పాపాన పోరు. జీహెచ్ఎంసీ మండిలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించకపోగా ప్రజా ప్రతినిధులు మండిలో పాదయాత్రలు మాత్రం చేసి వెళ్లిపోతున్నారు. జీహెచ్ఎంసీ నుంచి అనుమతి పొందిన మోండేదారులు 100 వరకు ఉండగా అనుమతి పొందని మోండేదారులు 150కి పైగా కొనసాగుతున్నారు. సుమారు 50 ఏళ్ల నుంచి జియాగూడ మేకలమండి కొనసాగుతుండగా అన్ని కులాల వారికి ఉపాధి లభిస్తుంది. అనాధికారికంగా లైసెన్స్ పొందని మోండేదారుల వ్యాపారుల వల్ల వెహికిల్ పార్కింగ్, లారీలు నిలపడానికి స్థలం కరువైంది. బక్రీద్, బోనాల పండుగల విక్రయాలు కూడా మోస్తారుగా జరిగినప్పటికీ వర్షాలు, బురద కారణంగా మండిలో సమస్యలు మరింత పెరిగాయి. వ్యాపారులు, కార్మికుల ఉపాధి, కష్టతరంగా మారింది. మండిని ప్రభుత్వమే పట్టించుకునే విధంగా చర్యలు చేపట్టాలి. 30 ఏళ్లుగా మండి సమస్యలతోనే కొనసాగుతుందని చెప్పక తప్పదు.